క్లుప్తంగా

నట్టల నివారణ మందులు తప్పనిసరి



గొర్రెలకు నట్టల నివారణ మందులు వేస్తున్న మండల పశు వైద్యాధికారి శ్రీవిద్య

శ్రీరంగరాజపురం: పెంపుడు జంతువులకు నట్టల నివారణ మందులు వేయించడం తప్పనిసరి అని మండల పశు వైద్యాధికారి శ్రీవిద్య అన్నారు. శుక్రవారం మండలంలోని నల్లాపల్లె, 50 బసివిరెడ్డిపల్లి, పద్మపురం, ఏఎం పురం గ్రామాల్లో దాదాపు 200 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. ఆమె ఈ కార్యక్రమం జూలై 10 వరకు మండల వ్యాప్తంగా కొనసాగించనున్నట్లు చెప్పారు. ప్రతి సచివాలయ పరిధిలో రైతు భరోసా కేంద్రం వద్ద నట్టల నివారణ మందులు ఉచితంగా ఇస్తామన్నారు.

మా మొర ఆలకించరా?



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులు

నగరి : 'సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దీక్షలు చేస్తున్నా అధికారులు మా మొర ఆలకించడం లేదు. ఇప్పటికైనా మా గురించి పట్టించుకోండి' అని మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వాపోయారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటుచేసిన దీక్షా శిబిరంలో శుక్రవారం ఐదో రోజూ మోకాలిపై నిలబడి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.

టీచర్‌కు ఉద్యోగ విరమణ సన్మానం



ఏలుమలై దంపతులను సన్మానిస్తున్న అధికారులు

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజు కుప్పం ప్రాథమిక పాఠశాల టీచర్ ఏలుమలై ఉద్యోగ విరమణ పురస్కరించుకుని శుక్రవారం ఎంఈఓ గిరిజ ఆధ్వర్యంలో వీడ్కోలు సన్మానం చేశారు. 25ఏళ్ల సర్వీసులో ఆయన ఎందరో భవితకు బాటలు వేశారని ఆయన సేవలు పలువురు ప్రస్తుతించారు. ఆయన తెలుగులో పద్యాలు ఆలపిస్తే పిల్లలు ఎంతో ఉత్సాహంగా వినేవారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరుణకుమారి, మండల ఎస్టీయూ అధ్యక్షుడు ప్రకాష్ తదితరులు మాట్లాడారు. విశ్రాంత టీచర్లు రఘు, గోవర్ధన్, టీచర్లు కోదండయ్య, వెంకటేశులు, కుమార్, ఏలుమలై, ఆర్ముగం, రాజా, ప్రకాశం, సీఆర్పీ రాజేశ్వరి, ఆర్ఐ దేవి, వీఆర్ఓ రమేష్, తంగరాజ్, పలువురు టీచర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం



చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మోహన్‌మురళి

శ్రీరంగరాజపురం : గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్‌మురళి అన్నారు. శుక్రవారం ఆయన తయ్యూరు,శె క్షీరసముద్రం, శ్రీరంగరాజపురం తదితర పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లు సేకరిస్తున్న చెత్తను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో రోజూ తడి, పొడి చెత్తను సేకరించి, స్వచ్ఛాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. డంపింగ్ యార్డులోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ద్వారా చెత్త నుంచి ఎరువులను తయారు చేసి వాటి విక్రయంతో పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వరదమ్మ, హరిత, పంచాయితీ కార్యదర్శి జ్యోత్స్న, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంఈవోలు

నగరి : మండలంలో వున్న పీఎంశ్రీకి ఎంపికైన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను శుక్రవారం ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం , అసిస్టెంట్ ఇంజినీరు నాగభూషణం పరిశీలించారు. పాఠశాల భవన నిర్మాణ పనులు, సైన్స్ ల్యాబ్, లైబ్రరీని తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ త్వరగా పనులను పూర్తిచేస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు పార్వతి దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువును పూడ్చేస్తున్నారు



తొట్టికశం చెరువులో వేసిన ఇళ్ల వ్యర్థాలు



చెరువులో వేసిన చెత్తకుప్పలు

- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల
- చెరువులు, కాలువల్లో జంగిల్ క్లియరెన్స్‌కు రూ.15.50 లక్షలు మంజూరు

నగరి : మండలంలోని దేశూరు అగరం సమీపంలోని తొట్టికశం చెరువుతో పాటు మరికొన్ని చెరువుల్లో వ్యర్థాలను విచ్చలవిడిగా వేస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. తద్వారా నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుందని చెబుతున్నారు. గతంలో ఒకసారి చెరువు నిండితే మూడు పంటలు పండేవని, ఇప్పుడు పూడిపోయి ఒక పంటలకు కూడా నీరు చాలడం లేదని పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా తొట్టి కళంకు చెరువుకు అనుసంధానంగా ఉన్న అయనంబాకం, దామరపాకం చెరువుల నుంచి వచ్చే కాలువల్లో జంగిల్ క్లియరెన్స్‌ను ప్రభుత్వం రూ.4.40 లక్షలు మంజూ చేసింది. ఈ పనులు ఒక వైపు జరుగుతున్నా కాలువలకు అనుసంధానంగా పలు చెరువులకు నీటిని చేరవేయడంతో పాటు సుమారు వెయ్యి ఎకరాల సాగుకు ప్రధానంగా నిలిచే తొట్టికళం చెరువులో ఇళ్లు కూల్చిన రాళ్లరప్పలు, మట్టి పోస్తుండడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై అధికారులు దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులకు సాగునీరు సమృద్ధిగా ఉంటే పంటలు పండిస్తారు. తద్వారా మార్కెట్‌లో ధరలు తగ్గి సామాన్యులకు సైతం అందుబాటులోకి వస్తాయి. ఈ విషయాన్ని గురించిన పెద్దలు పూర్వమే పెద్ద ఎత్తున చెరువులు తవ్వించారు. వర్షాలు కురిసిన సమయంలో వాటిలోకి నీరు చేరేలా కాలువలను సైతం ఏర్పాటుచేశారు. ఇప్పుడు కొంతమంది ఇళ్లను పడగొట్టిన వ్యర్థాలను తీసుకువచ్చి చెరువుల్లో వేసి పూడ్చేస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

జంగిల్ క్లియరెన్స్‌కు రూ.15.50 లక్షలు మంజూరు

వర్షాకాలం సమీపిస్తుండటంతో నీటిపారుదల కాలువల్లో పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు, ఇతర అడ్డంకులు తొలగించి శుభ్రపరచడానికి రూ.12.90 లక్షలను ప్రభుత్వం మంజూరుచేసింది. వీటిలో నెత్తం కండ్రిగ చెరువుకు రూ.2.20 లక్షలు, అయనంబాకం చెరువుకు రూ.2.30 లక్షలు, దామరపాకంకు రూ.2.10 లక్షలు, మేళపట్టుకు రూ.2.30 లక్షలు, మాంగాడుకు రూ.2.10, సత్రవాడకు రూ.1.90 లక్షలు కేటాయించారు. అలాగే రాష్ట్ర సరిహద్దు పూనిమాంగాడు గ్రామాన్ని ఆనుకొని ఉన్న ఆనకట్ట వద్ద లాకులు సరిచేయడానికి మరో రూ.2.60 లక్షలు మంజూరైంది.

కనిపించని అధికారులు

చెరువులు, కాలువలు శుభ్రపరచడానికి నిధులు కేటాయించడం మాత్రమే సరిపోదని వాటిపై పర్యవేక్షణ ఉండాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు చెరువుల వైపు కన్నెత్తికూడా చూడడం లేదని ఆరోపిస్తున్నారు. అందువల్లే చెత్తాచెదారంతో పాటు వ్యర్థాలను చెరువుల్లో వేస్తున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా చెరువులను పరిరక్షించాలని కోరుతున్నారు.

నియోజకవర్గంలోని చెరువులు

మండలం	మైనర్ ఇరిగేషన్ చెరువులు	సామర్థ్యం ఎంసీ ఎఫ్‌టీ
నగరి	34	408.32
పుత్తూరు	32	177.03
నింద్ర	41	229.69
విజయపురం	30	420.57
వడమాలపేట	26	290.48
	163	1526.09

పరిశీలించి చర్యలు చేపడతాం

"చెరువుల్లో వ్యర్థాలు వేయకూడదు. సంబంధిత చెరువును పరిశీలిస్తాం. స్థానికంగా ఉన్న సచివాలయ కార్యదర్శి చెరువుల విషయంలో ఎప్పటికప్పుడు సమాచారం అందించేలా ఏర్పాట్లు చేస్తాం. చెరువులో మట్టిపోసిన వారిపై చర్యలు తీసుకుంటాం.

– ప్రశాంత్, ఇరిగేషన్ ఏఈఈ, నగరి

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

నగరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి కంప్యూటర్ సైన్స్ – కంప్యూటర్ అప్లికేషన్స్‌లో బోధన కోసం తాత్కాలిక ప్రాతిపదికతోపాటు అతిథి అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆర్ వేణుగోపాల్ తెలిపారు. అభ్యర్థులు ఎంసీఏ, ఎమ్మెస్సీ, ఎంటెక్ కంప్యూటర్స్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఎంఫిల్, పీహెచ్‌డీ, యూజీసీ–నెట్, ఏపీ సెట్, ఏపీ స్లెట్ అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఈ నెల 30వ తేదీ ఉదయం 10.30 గంటలకు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు వచ్చి డెమాన్స్ట్రేషన్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 9866866854లో సంప్రదించాలన్నారు.

ఇంటింటా చెత్త సేకరణపై డీపీఓ ఆరా



నల్లవెంగనపల్లెలో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న డీపీఓ సుధాకరరావు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం, నల్లవెంగనపల్లె పంచాయతీల్లో శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి సుధాకరరావు పర్యటించారు. ఇంటింటా చెత్త సేకరణపై ఆయన ఆరా తీశారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఐవీఆర్ఎస్ పంచాయతీలుగా ఎంపిక చేసిన వాటి పరిధిలో ఇంటింటా చెత్త సేకరణను తరచూ పరిశీలిస్తున్నట్లు ఆయన చెప్పారు. తద్వారా ఈ కార్యక్రమాన్ని సిబ్బంది మరింత సమర్థవంతంగా చేయాలన్నదే తమ ఉద్దేశమన్నారు. అనంతరం వెదురుకుప్పంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నీళ్ల ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. అనంతరం డంపింగ్ యార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పురుషోత్తం పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి

చిత్తూరు కార్పొరేషన్: మెరుగైన విద్యుత్ సరఫరాను అందించడానికి కృషి చేస్తున్నామని ట్రాన్స్‌కో చిత్తూరు రూరల్ ఈఈ సురేష్ తెలిపారు. ఆయన శుక్రవారం పలు అంశాలపై మాట్లాడారు. ఆవులకొండలోని సబ్‌స్టేషన్‌లో కోటి విలువతో 8 ఎంవీఏ సామర్థ్యంతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. అక్కడున్న 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను పాలసముద్రం సబ్‌స్టేషన్‌లో బిగించామన్నారు. వీటి ద్వారా వ్యవసాయానికి మెరుగైన సరఫరా వస్తుందన్నారు. కార్వేటినగరం మండలంలోని అనూర్ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రం(ఎస్‌పీఎం) నిర్మాణ పనులు చేస్తున్నట్లు తెలిపారు. పనులు పూర్తయ్యాక కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం, పచ్చికాపళ్లం, నగరి ప్రాంతాల రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతును అక్కడే చేసుకోవచ్చని తెలిపారు. చిత్తూరుకు రావాల్సిన అవసరం లేదన్నారు. భద్రతా వారోత్సవాల సందర్భంగా సబ్‌స్టేషన్లలో ఉద్యోగులు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.

సూపరింటెండెంట్‌గా రవిశేఖర్ బాధ్యతల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్ : డీఈవో కార్యాలయం నూతన సూపరింటెండెంట్‌గా రవిశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డీఈవో వరలక్ష్మిని కలిశారు. ఆయనను డీఈవో కార్యాలయంలోని సూపరింటెండెంట్‌లు స్వర్ణలత, నందకుమార్, రమేష్, సిబ్బంది మురళీ, గోపాల్, సాయి, ఆనంద్, జయప్రకాష్‌రెడ్డి, తదితరులు అభినందించారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేద పండితులు



గ్రామంలో విహరిస్తున్న ద్రౌపదీ ధర్మరాజుల స్వామి

కార్వేటినగరం: ద్రౌపదీ ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమంలో సకల దేవతలను ఆహ్వానించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణం భాగవతారిణి రెడ్డెమ్మ హరికథా గానం చేశారు. మధ్యాహ్నం రేవతి ప్రసాద్ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.



అన్నదానం చేస్తున్న రేవతీ ప్రసాద్ కుటుంబ సభ్యులు

గ్రామ వీధుల్లో ఊరేగిన ద్రౌపదీ అమ్మవారు

రాత్రి ద్రౌపదీ, ధర్మరాజుల స్వామివారు ప్రత్యేక వాహనంపై కొలువు దీరి బాణసంచా మోత, మంగళవాయిద్యాల హోరు నడుమ గ్రామ వీధుల్లో విహరించారు. భక్తులు ఇంటింటా కర్పూర నీరాజనాలు సమర్పించారు. యాదవ కులస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రవియాదవ్, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రాజు, ఉపాధ్యక్షుడు కట్ల రవిరెడ్డి, కోశాధికారి లక్ష్మీపతి, ఉప కోశాధికారి సాయిరాయల్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా క్రిష్ణచైతన్య



వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా క్రిష్ణ చైతన్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్యసేవలు అందివ్వాలన్నారు.

మాతమ్మకు పూజలు..ఊరేగింపు



మాతమ్మను ఊరేగిస్తున్న కాపుకట్టిన భక్తులు

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురం ఆది ఆంధ్రవాడలో నిర్వహిస్తున్న మాతమ్మ కొలువు మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి ఎదుట ముగ్గు వేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారిని సుందరంగా అలంకరించి దీపారాధన చేశారు. కాపుకట్టిన భక్తులతో పుర వీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. ఇంటింటా మహిళలు టెంకాయలు కొట్టి, మొక్కులు చెల్లించారు. సాయంత్రం భక్తిప్రపత్తులతో అర్జున తపస్మాన్ కార్యక్రమం నిర్వహించారు.



అమ్మవారి ఎదుట తపస్మాన్ కార్యక్రమం

మేం కొనలేం!



- చేతులెత్తేసిన మామిడి గుజ్జు పరిశ్రమలు
- ఆపసోపాలు పడుతున్న అన్నదాతలు
- పట్టించుకోని కూటమి నేతలు



జైన్ గుజ్జు పరిశ్రమ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు




కిలోమీటర్ల మేర నిలిచిపోయిన మామిడి ట్రాక్టర్లు, (ఇన్‌సెట్) కుళ్లిపోయి రోడ్డుపై పడేసిన మామిడి

గేటు దాటని మామిడి!

గంగాధర నెల్లూరు: జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆశించిన స్థాయిలో పంట చేతికొచ్చినా ధరలేక విక్రయించుకోలేని దుస్థితి నెలకొంది. ఇటు ప్రభుత్వం పట్టించుకోక.. అటు పెట్టుబడి చేతికందక నష్టాల్లో మునిగిపోవాల్సి వచ్చింది. ఫ్యాక్టరీల ఎదుట మామిడికాయల లోడ్లతో రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఎదురైంది. ఆయా ఫ్యాక్టరీలు సైతం 'మేం కొనలేం' అంటూ బోర్డులు పెట్టేయడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది.

గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని జైన్ మామిడి గుజ్జు కర్మాగారం వద్ద జూన్ 17 నుంచి 21 వరకు మామిడి కొనలేమంటూ బోర్డు పెట్టేశారు. ఫ్యాక్టరీ ఎదుట దాదాపు 450 లోడ్లు దాకా ట్రాక్టర్లు వేచి ఉన్నాయి. అదేవిధంగా 23 నుంచి 27వ తేదీ వరకు సీరియల్ నంబర్లు కేటాయించలేమంటూ చేతులెత్తేశారు. వర్షపు చినుకులతో మామిడిలో పురుగుపట్టే అవకాశం ఎక్కువగా ఉందని, రాలు సమస్య కూడా ఎక్కువగా ఉందని ఫ్యాక్టరీ యాజమాన్యాలు వీలైనంత త్వరగా మామిడిని కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.


ఖర్చు బోలెడు



మామిడి కాయలు ఒక ట్రాక్టర్ లోడ్‌కు ఐదు టన్నులు దాకా వస్తాయి. వీటిని తోటల్లో కోసి లోడింగ్ చేసి ఫ్యాక్టరీ దాకా తీసుకెళ్లాలంటే ఒక్కో లోడ్డుకు రూ.7 వేల దాకా ఖర్చవుతోంది. ఫ్యాక్టరీల వద్ద సకాలంలో అన్‌లోడ్ కాకపోవడంతో దాదాపు 500 కేజీల దాకా కుళ్లిపోతున్నాయి. పెట్టుబడి, కూలీ ఖర్చులు పోగా దాదాపు లోడ్డుకు మూడు నాలుగు వేలు కూడా రావడం లేదు.

– బాబునాయుడు, జాన్లపెంట గ్రామం

అన్‌లోడింగ్‌కి 16 గంటలు



రోజుల తరబడి ఫ్యాక్టరీ గేటు వద్ద వేచి ఉన్నాం. గేటు దాటి లోపలికి వెళ్లి అన్‌లోడింగ్ చేయడానికి దాదాపు 12 నుంచి 16 గంటల సమయం పడుతోంది. ఫ్యాక్టరీ లోపలికి వెళ్లి వెయిటేజీ తర్వాత రేటు చెప్పకుండా అంగీకార పత్రాలపై సంతకాలు చేయించుకుంటున్నారు. డబ్బులు ఎప్పుడిస్తారో కూడా చెప్పడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

– పార్థసారథి, పద్మాపురం గ్రామం

వారికి మాత్రం జీరో వేస్టేజీ



కొందరు రాత్రి సమయాల్లో దర్జాగా ఫ్యాక్టరీల్లోకి వెళ్లి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. నాలుగైదు రోజులుగా వేచి ఉన్న రైతుకు వేస్టేజీ టన్ను దాకా పోతోంది. అదే నేరుగా వెళ్లిన విక్రయించుకుంటున్న వారికి మాత్రం జీరో వేస్టేజీతో పూర్తిస్థాయి ఆదాయం వస్తోంది. వారిని కట్టడి చేసి సీరియల్ నంబర్ ప్రకారం వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలి.

– బోడిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పెద్దదామరగుంట గ్రామం

అవస్థలు పడుతున్నాం



సంవత్సరం పాటు కంటికి రెప్పలా కాపాడుకున్నాం. తీరా పంట చేతికొచ్చాక తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. కష్టపడి పండించిన మామిడి రోడ్డుపాలు అవుతోంది. ఫ్యాక్టరీల వద్ద నాలుగైదు రోజుల తరబడి ట్రాక్టర్‌లోనే మామిడి ఉండడంతో కుళ్లిపోతున్నాయి. విధిలేని పరిస్థితుల్లో రోడ్డున పడేయాల్సి వస్తోంది.

– జగదీష్, చవనపల్లె గ్రామం

మాదకద్రవ్యాల వినియోగంతో అనర్థాలు

వెదురుకుప్పం: మాదకద్రవ్యాల వినియోగంతో పలు అనర్థాలు సంభవిస్తాయని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం దుష్పరిణామాలపై శుక్రవారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసలైన యువకులు తప్పుదోవ పడుతున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం, ఐక్యూఏసీ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గంగాధర నెల్లూరు : 95539 55610
నగరి : 95539 55609